క్లుప్తంగా

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెద వాగు ప్రాజెక్ట్ గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో స్పాట్ కౌన్సిలింగ్-3కు అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.రోజా కోరారు. కళాశాలలో ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్సీ, బీఏ, బీకాం(జీ), బీకాం(సీఏ) గ్రూపులలో ప్రవేశానికి ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోచ్చన్నారు. సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాలతో సెప్టెంబర్ 3వ తేదీలోపు కళాశాలలో అందించాలని ఆమె సూచించారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన జెడ్పీటీసీ దంపతులు

బూర్గంపాడు: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బూర్గంపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. తొందరలోనే గోదావరి వరదలు, నష్ట నివారణ చర్యలపై నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు.

మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

దమ్మపేట: సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, దుర్గమల్లేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో ఉన్న దుర్గమల్లేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్రకు, ఆలయ కమిటీ చైర్మన్ రావు గంగాధరరావు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఆలయ అర్చకులు శివుడికి నిర్వహించిన ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాల్లో సండ్ర పాల్గొని, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

మణుగూరురూరల్: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతిగౌడ్ పిలుపునిచ్చారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 నూతన సైట్ ఆఫీస్ సమీపంలోని డంప్ యార్డ్‌లో సోమవారం పీకేఓసీ యాజమాన్యం ఆధ్వర్యంలో వీపీఆర్ ఓబీ వెలికితీత కాంట్రాక్టర్, కార్మికుల సహకారంతో సుమారు రెండు వేల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడారు. కార్యక్రమంలో పీకేఓసీ రక్షణ అధికారి లింగబాబు, వీపీఆర్ మేనేజర్ బిపిన్, అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

అశ్వారావుపేటరూరల్: విద్యాశాఖ సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగులంతా కలిసి 'సారూ.. జర మా గోస వినుండ్రీ'అంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ఆయా శాఖల్లో పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించాలని, అప్పటి వరకు టైం స్కేలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు ప్రభాకరాచార్యులు, మాలోతు రామారావు, రాజు, హనుమంతు, నాగేశ్వరరావు, మల్లేష్, జ్యోతి, మహబూబ్, రమేష్, రామారావు, లక్ష్మి, శ్రీను, రమణ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం

అశ్వారావుపేటరూరల్: విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ సంఘం రాజీలేని పోరాటాలు చేస్తుందని ఆ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వాలు వృత్తి విద్య కోర్సులు ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మండల కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా నిఖిల్, కార్యదర్శి ఖాసీం, సహాయ కార్యదర్శిగా రాజు, సభ్యులుగా రాజు, ఆదిత్య, పవన్, కల్యాణ్, మిస్రీన్, నిహారిక, మధుప్రియ, భావనను ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

కరకగూడెం: విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన నాగ బండి వెంకటేశ్వర్లుకు చెందిన పాడి గేదె సోమవారం రోజువారిగా గ్రామంలోని ఓ రైతు పొలంలో మేత మేస్తుండగా అక్కడ నిర్లక్ష్యంగా కరెంటు తీగలను కిందకు ఉన్నాయి. గేదె వాటికి తగిలి విద్యుత్ షాక్కు గురై మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, సంబంధిత అధికారులు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఏజెన్సీపై ఆర్టీసీ వివక్ష!

- రాత్రి ఏడున్నర దాటితే బస్సులు బంద్
- ఉదయం ఏడు గంటల వరకు కనిపించవు..
- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం



ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణిస్తున్న ఏజెన్సీవాసులు (ఫైల్)

చర్ల: ఏజెన్సీపై ఆర్టీసీ అధికారులు వివక్ష చూపుతున్నారని ఆ ప్రాంతాల వాసులు విమర్శిస్తున్నారు. రాత్రి ఏడున్నర గంటలు దాటితే బస్సులు నిలిపివేయడం, ఉదయం మళ్లీ ఏడు గంటల వరకు బస్సులను రోడ్లపైకి వదలక పోవడమే వారి ఆగ్రహానికి కారణం. పదే పదే బస్సుల కోసం మొర పెట్టుకుంటున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మావోయిస్టు వారోత్సవాలతో మొదలు..

భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి దుమ్ముగూడెం, చర్ల మీదుగా వెంకటాపురానికి గతంలో రాత్రి 10 గంటల వరకు బస్సులు నడిచేవి. దీంతో దూర ప్రాంతాల నుంచి భద్రాచలానికి వచ్చి అక్కడి నుంచి దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం మండలాలకు చేరుకునే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేది. కానీ మావోయిస్టులు బంద్‌లు, వారోత్సవాలకు పిలుపునిచ్చిన పలు సందర్భాల్లో చర్ల, వెంకటాపురం మండలాలలకు సాయంత్రం నాలుగు గంటల తరువాత బస్సులను నిలిపివేసి మళ్లీ ఉదయం 8 గంటల తరువాత పునరుద్ధరించేవారు. అయితే అటు తరువాత దానినే కంటిన్యూ చేస్తూ వచ్చిన ఆర్టీసీ అధికారులు.. రాత్రి 7.30 గంటల నుంచి చర్ల, వెంకటాపురానికి పూర్తిగా బస్సులు నిలిపివేయడం ఆరంభించారు. దూర ప్రాంతాల నుంచి భద్రాచలంకు చేరుకుని అక్కడి నుంచి దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం మండలాలకు చేరుకోవాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఆటోలను, టాటా మ్యాజిక్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దుమ్ముగూడెం, చర్ల మధ్యలో ఎక్కడ దిగినా రూ.100, వెంకటాపురం వరకు ఎక్కడ దిగినా రూ.200లు చెల్లించుకోవాల్సిన పరిస్థితితులు ఎదురవుతున్నాయి. ఫలితంగా దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణికుల రద్దీ ఉన్నప్పటికీ..

ప్రతి రోజూ రాత్రి 7.30 గంటల నుంచి 10.00 గంటల మధ్య చర్ల, వెంకటాపురానికి కనీసం 8 టాటా మ్యాజిక్‌లు అయినా ప్రయాణికులను తరలిస్తున్నాయి. ప్రతీ ఆటోలో కనీసం 12 మంది ఎక్కినా ఆరు ఆటోల ద్వారా రోజుకు సగటున 96 మంది ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రి 7.30 గంటల తరువాత ఇంత మంది దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం మండలాలకు ప్రయాణాలు సాగిస్తున్నప్పటికీ ఆర్టీసీ అధికారులు మాత్రం సర్వీసు ఉండడం లేదని, డబ్బులు రావడం లేదని చెబుతున్నారు. ఆ సాకుతోనే ఈ మార్గంలో బస్సులు నడపకుండా నిలిపివేస్తున్నారు.

దీనిపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీ నిత్యం రాబడిపైనే దృష్టి పెట్టకుండా కాస్తా సర్వీసు మోటోలో కూడా ఆలోచించాలని వారు కోరుతున్నారు. చర్ల, వెంకటాపురం మార్గాల్లో రాత్రి కనీసం 9.30 గంటల వరకు బస్సులు నడపాలని, వెంకటాపురం నుంచి తెల్లవారుజామున 5 గంటల నుంచి అయినా భద్రాచలం బస్సు సర్వీసును ప్రారంభించాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

రాత్రి 9:30 వరకు నడపాలి

భద్రాచలం నుంచి గతంలో రాత్రి 10 గంటల వరకు బస్సులు ఉండేవి. ఇప్పుడు మాత్రం రాత్రి ఎడున్నర దాటితే చర్లకు రావాలంటే చాలా కష్టంగా ఉంటోంది. చర్లకు 60 రూపాయలు బస్సు టికెట్టు ఉంటే రాత్రి కావడంతో ఆటో వాళ్లు కనీసం వంద రూపాయలు లేనిదే రావడం లేదు. అధికారులు రాత్రి తొమ్మిదిన్నర వరకు బస్సులు నడపాలి.

– మామిడి రాజు, తేగడ

ఉదయం 5 నుంచి సర్వీసు ఉండాలి

గతంలో తెల్లవారుజామున 5 గంటల నుంచి భద్రాచలానికి బస్సులు ఉండేవి. ప్రస్తుతం బస్సులన్నీ రద్దు చేశారు. దూరప్రాంతాలకు వెళ్లాలంటే ఉదయం 7.30 కానిది బస్సులు లేవు. ఈ టైమ్‌లో ప్రయివేటు వాహనాలు కూడా రాకపోతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు తెల్లవారుజాము నుంచి బస్సులు నడపాలి.

– ఎం.విజయరాజు, ఆర్‌కొత్తగూడెం

ఆదాయం లేక రద్దు చేశాం

చర్ల, వెంకటాపురం మార్గంలో రాత్రి 7.30 గంటల తరువాత ప్రయాణీకులెవరూ బస్సులు ఎక్కడం లేదు. దీంతో బస్సు పెట్టినప్పటికీ ఖాళీగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో బస్సులను రద్దు చేశాం. ప్రయాణికుల నుంచి ఆదరణ ఉంటే మళ్లీ ఉన్నతాధికారులకు వివరిస్తాం. రద్దు చేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించేందుకు కృషి చేస్తాం.

– ఆర్టీసీ డీఎం రామారావు, భద్రాచలం

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా



న్యాయం చేయాలంటూ అధికారులకు చేతులెత్తి మొక్కుతున్న వరద బాధితులు

చర్ల: మండలంలోని గోదావరి వరద ముంపు గ్రామాల్లోని బాధితులందరికీ ఎత్తైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ వరద బాధితుల పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మొదట బాధితులు చర్లలోని సర్వే నంబర్ 117లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్లు కట్టుకుంటామని ఆ స్థలాన్ని మోహరించారు. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ధర్నా చేపట్టారు. ఇంటి స్థలాల మంజూరుపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదిలేది లేదంటూ బాధితులు భీష్మించడంతో ఎస్సై పీవీఆర్ సూరి అక్కడికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడి తహసీల్దార్ రంగు రమేష్ ద్వారా చర్చలు జరిపారు. తమకు న్యాయం చేయాలని చేతులెత్తి నమస్కరిస్తూ తహసీల్దార్‌ను వేడుకున్నారు. వారం రోజుల్లో సర్వే చేయించి బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో బాధితులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన గోదావరి ముంపు బాధితులు పాల్గొన్నారు.

సీపీఎం గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

దుమ్ముగూడెం: రాబోయే ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో సీపీఎం గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ములకపాడు పార్టీ కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ జోన్ బాధ్యుల సమావేశం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గంలో సీపీఎం గెలుపు కోసం ప్రతి కార్యకర్తా, నాయకుడు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, బి.రమేష్, యాస నరేష్, మర్మం చంద్రయ్య, మహమ్మద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన



భద్రాచలంఅర్బన్: వంటావార్పులో నినాదాలు చేస్తున్న నాయకులు, రెండో ఏఎన్‌ఎంలు



మణుగూరురూరల్: సెకండ్ ఏఎన్‌ఎంల మానవహారం

మణుగూరురూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సెకండ్ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం మణుగూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించి అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆర్.లక్ష్మీనారాయణ సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సెకండ్ ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని, కొత్త నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు మోహన్‌రావు, సుధాకర్, నాయకులు సోందె కుటుంబరావు, ఎస్‌కె.సర్వర్, వీరయ్య, రాములు, సెకండ్ ఏఎన్‌ఎంలు ఇందిర, సుమలత, సంధ్య, ఈశ్వరరాణి, సుజాత, శాంతకుమారి, పార్వతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: తమ సమస్యల పరిష్కారంలో తెలంగాణ రాష్ట్ర మొండి వైఖరికి నిరసనగా స్థానిక భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లో రెండవ ఏఎన్‌ఎంలు సోమవారం వంటా వార్పు చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బల్లా సాయి కుమార్లు పాల్గొని మాట్లాడారు. మారో రోజు సమ్మెకు ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మధుసూదనా రెడ్డి, పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు శివలు సంఘీభావం తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మారెడ్డి శివాజీ, లంకపల్లి విశ్వనాథ్, నరసింహులు, శోభన్ బాబు, ఏఐవైఎఫ్ నాయకులు కొలిపాక శివ కుమార్, ప్రభ, సీపీఐ నాయకులు అయినాల రామకృష్ణ, జక్కం గోపి, రెండవ ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బంది వినతి

భద్రాచలంటౌన్: ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫారెస్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది భద్రాచలం డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ శాఖలో గత 15 ఏళ్లుగా డేటా ఎంట్రీ అపరేటర్స్, డ్రైవర్లు, బేస్ క్యాంపు వాచర్స్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి జీతాలు ఇప్పించి, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించడంతో పాటు క్రమబద్ధికరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలమురళి కృష్ణ, కృష్ణయ్య, యడమరాజు, రమేష్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

చంద్రుగొండ: ఈవీఎం ద్వారా ఓటు వేసే ప్రక్రియపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎంపీడీఓ జి.రేవతి కోరారు. మండలంలోని బెండాలపాడు, గుర్రాయిగూడెం పంచాయతీల్లో సోమవారం అవగాహన ప్రారంభించారు. సెప్టెంబర్ 3 తేదీ వరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఎం.వీరభద్రం, ఎం.నర్సింహారావు, నితిన్, లక్ష్మి, సెక్రటరీలు జె.షర్మిల, ఎన్ఎన్ రోహిత్ పాల్గొన్నారు.

గంబుషియా చేపల విడుదల

దుమ్ముగూడెం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని లక్ష్మీనగరం, ములకపాడు, దుమ్ముగూడెం, శ్రీనగర్ కాలనీ, మంగువాయి బాడవ గ్రామాల్లో సోమవారం దోమల లార్వాలను తినే గంబుసియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పుల్లారెడ్డి మాట్లాడుతూ.. గంబుషియా చేపలు దోమ లార్వాను తింటాయని, తద్వారా దోమలను వృద్ధి చెందకుండా నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ ధర్మయ్య, గంగాధర్, మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

మణుగూరురూరల్: మండలంలోని అశోక్‌నగర్ ప్రాంతంలోని బాలుర, బాలికల వసతిగృహాల్లో మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేస్, రవి తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

ములకలపల్లి: ఆశా కార్మికలకు పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు దుబ్బా ధనలక్ష్మి అన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, సంఘం ఆధ్వర్యంలో స్థానిక మంగపేట పీహెచ్‌సీ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆశాలకు ఉద్యోగభద్రత కల్పించాలని అన్నారు. అనంతరం వైద్యాధికారి సాయికల్యాణ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుంజా కుమారి, మీనాకుమారి, పార్వతి, సుహాసిని. లలిత, గడ్డం దీనకుమారి తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: రాష్ట్రంలోని కులవృత్తుల వారి అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలోని వాసవినగర్ గిరిజన భవన్‌లో పినపాక నియోజకవర్గంలోని 300 మంది బీసీ కులవృత్తుల వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.3కోట్ల ఆర్థిక సహాయ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే రేగా కాంతారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నూతనంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న బీసీబంధు పథకం దేశానికే ఆదర్శమన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, పలు విభాగాల అధికారులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్ సోదరుడు ఎన్నా రంజిత్‌కుమార్ ఇటీవల డెంగీతో మృతి చెందగా సోమవారం దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు కార్యక్రమానికి హాజరై రంజిత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, గద్దల రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఎక్కడ?

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చి రెండేళ్లు పూరైనా ఇప్పటికీ ఏర్పాటు చేయలేదని, అంబేడ్కర్ విగ్రహం ఎక్కడ అని అంబేడ్కర్ విగ్రహ సాధన కమిటీ కన్వీనర్ పూనెం వీరభద్రం ప్రశ్నించారు. పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ సెంటర్‌లో సోమవారం జరిగిన విగ్రహ సాధన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

అప్పటి ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఏర్పాటు చేయిస్తానంటే.. స్థానిక ఎమ్మెల్యేగా నేనే ఏర్పాటు చేయిస్తానని మాట ఇచ్చారని, కానీ ఇప్పటికీ ఆ దిశగా పనులు జరగలేదని విమర్శించారు. సమావేశంలో కృష్ణ దొర, నాగేశ్వరరావు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

సాక్షి ఎఫెక్ట్..



లక్ష్మీనగరంలో వీధి లైట్లు వేయిస్తున్న ఎంపీడీఓ, కార్యదర్శి

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం, ములకపాడు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సాక్షి కథనాలు ప్రచురించగా సోమవారం ఎంపీడీఓ ముత్యాలరావు స్పందించి వాటిని పరిష్కరించారు. లక్ష్మీనగరం గ్రామంలో ప్రధాన రహదారిపై రాత్రి వేళలో వీధి లైట్లు వెలగకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని 'ప్రధాన రహదారి అంధకారం' కథనాన్ని 'సాక్షి' ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన ఎంపీడీఓ గ్రామంలో వీధి లైట్లను ఏర్పాటు చేయించారు. అలాగే ములకపాడు పంచాయతీ పరిధిలోని పశువైద్యశాలలో బురదమయంగా, పిచ్చి మొక్కలతో ఉండడాన్ని 'పశువుల వైద్యశాలకు దారేది' శీర్షికన ప్రచురితమవగా.. ఎంపీడీఓ పిచ్చి మొక్కలను తొలగించారు. బురదనీరు పూర్తిగా ఆగకుండా వెళ్లేందుకు రెండు రోజుల్లో పూర్తి స్థాయి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనూష, సాహితి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ కార్డులు పంపిణీ



న్యాయవాదులకు హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం న్యాయమూర్తి మీసాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం అధ్యక్షత వహించారు.

న్యాయవాదులకు రూ. 2 లక్షల వరకు ఇన్సూరెన్స్ కవరేజ్ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి దేవదానం కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రస్తుతం ఉన్న రూ.2లక్షల కవరేజ్ పరిధిని 5లక్షలకు పెంచాలని దేవదానం అన్నారు. వృద్ధులైన న్యాయవాదుల తల్లిదండ్రులకు కూడా ఈ పథకం వర్తింపజేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు

దుమ్ముగూడెం: పర్ణశాల పీహెచ్‌సీ, ఆర్లగూడెం ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం వేరువేరుగా వైద్యశిబిరాలను నిర్వహించారు. పర్ణశాల డాక్టర్ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో టైలర్‌పేట గ్రామంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

అనంతరం పిహెచ్‌సి పరిధిలోని చినబండిరేవు, పెద్దబండిరేవు గ్రామాల్లోని నీటి నిల్వలలో గంబూషియా చేపలను వదిలారు. అలాగే ఆర్లగూడెం ఆయుర్వేద డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో రామకృష్ణాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగేశ్వరావు, నలంద, పారామెడికల్ సిబ్బంది వీరభద్రం, ఆశావర్కర్ కృష్ణవేణి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మలేరియా ప్రభావిత గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. మండలంలోని దబ్బతోగు, దబ్బతోగు కాలనీ, పాకలగూడెం గ్రామాల్లో వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణ దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాల్లో 67 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. వీరిలో ఏడుగురు జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలను సేకరించి పరీక్షించగా మలేరియా నిర్ధారణ కాలేదని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, సిబ్బంది రాజు, శ్రీనివాస్, రవి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు



అశ్వాపురం: రేగాను అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడంతో స్థానికంగా ఆయా నియోజకవర్గాల్లోని అభ్యర్థుల అనుచర గణం సంబురాలు చేసుకున్నారు. పినపాకలో ఎమ్మెల్యే రేగా కాంతారావుకు, అశ్వారావుపేటలో మెచ్చా నాగేశ్వరరావుకు, భద్రాచలంలో డాక్టర్ తెల్లం వెంకట్రావుకు సీట్లు కేటాయించడంపై ఆయా ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు బాణసంచా పేల్చి సందడి చేశారు. స్వీట్లు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే అభ్యర్థులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా అభ్యర్థులు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ కార్యకర్తలతో గడిపారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: మెచ్చాను ప్రకటించడంపై పట్వారిగూడెంలో టపాసుల మోతలు..



భద్రాచలం: తెల్లం వెంకట్రావ్‌కు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలుపుతున్న మహిళలు